సాక్షి
కర్నూలు
ఆదివారం ॥ 29 ॥ అక్టోబర్ ॥ 2023



ముగిసిన దేవరగట్టు ఉత్సవాలు

దేవరగట్టు దసరా బన్ని మహోత్సవాలు శనివారం ముగిశాయి. ఉత్సవ విగ్రహాలు నెరణికి గ్రామానికి చేరాయి. దీంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. 8లో



తరగతి గదిలోనే..

తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్ నిర్మాణమవుతుందని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. శ్రీశైలం ప్రాజెక్ట్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. 8లో



కమనీయం.. పవిత్రోత్సవం

ఆళ్లగడ్డ: అహోబిలంలో వార్షిక పవిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శనివారం యాగశాలలో హోమం నిర్వహించారు. గ్రామోత్సవం కనుల పండువగా సాగింది.

న్యూస్‌రీల్

సజావుగా ఎఫ్‌ఎల్‌సీ ప్రక్రియ



ఈవీఎం గోదాములోకి వెళ్తున్న కలెక్టర్

కర్నూలు(సెంట్రల్): ఈవీఎంలు, వీవీ ప్యాట్ల పనితీరు పరిశీలన కోసం నిర్వహిస్తున్న ఫస్టు లెవల్ చెక్(ఎఫ్ఎల్‌సీ) ప్రక్రియను సజావుగా చేపడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్లోని ఈవీఎం గోదాములో జరుగుతున్న ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను ఆమె పరిశీలించారు. అక్టోబర్ 16 నుంచి ప్రారంభమైన ఈ ప్రక్రియ వచ్చే నెల 10వ తేదీలోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్‌సీ నోడల్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి నాగరాజునాయుడు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి పాల్గొన్నారు.

ఆర్టీసీకి పెరిగిన 'దసరా' ఆదాయం

కర్నూలు(రాజ్‌విహార్): దసరా పండుగ సందర్భంగా రోడ్డు రవాణా సంస్థ నడిపిన ప్రత్యేక బస్సుల ద్వారా గతేడాది కంటే ఆదాయం పెరిగిందని జిల్లా ప్రజా రవాణా శాఖాధికారి వెంకటరామం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, చెన్నై, విజయవాడ, నెల్లూరు.. తదితర దూర ప్రాంతాలకు 111 బస్సులు నడపగా వీటి ద్వారా రూ.29.42లక్ష ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. గత ఏడాది రూ.14.36 లక్షల ఆదాయం వచ్చిందని తెలిపారు. ప్రత్యేక బస్సులు అయినా ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటిలో సాధారణ చార్జీలే వసూలు చేశామన్నారు.

నంద్యాలలో రూ.98 లక్షలతో కలెక్టరేట్

కర్నూలు (న్యూసిటీ): నూతనంగా ఏర్పడిన నంద్యాల జిల్లాలో కలెక్టరేట్ భవన నిర్మాణానికి రూ.98.55 లక్షల నిధులు మంజూరయ్యాని ఆర్అండ్‌బీ ఎస్ఈ నాగరాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భవన నిర్మాణానికి సంబంధించిన ఎస్టిమేషన్ తయారు చేసి ప్రభుత్వానికి పంపుతామని, అనుమతులు వచ్చిన వెంటనే టెండర్లు ఆహ్వానిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి ఆమోద ముద్ర లభించిన వెంటనే భవన నిర్మాణం ప్రారంభిస్తామని తెలిపారు.

'ఓపెన్' దరఖాస్తుకు నెలాఖరు వరకు గడువు

కర్నూలు సిటీ: ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా 2023-24 విద్యా సంవత్సరానికి 10వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాలు పొందేందుకు దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31వ తేదీ తో గడువు ముగియనుంది. అర్హత, ఆసక్తి ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు ప్రకటించారు. 14 ఏళ్ల నిండిన వారు 10వ తరగతిలో, 15 సంవత్సరాల నిండిన వారు ఇంటర్‌లో అడ్మిషన్ పొందవచ్చు.

తాజా బంధాలు.. పచ్చని జీవితాలు!

- ఉపాధినిస్తున్న కూరగాయల మార్కెట్
- రైతులు, వ్యాపారుల మధ్య పెనవేసుకున్న బంధం
- నిద్రలేని రాత్రిళ్లతో భారంగా జీవనం
- పచ్చి సరుకుతో బతుకు పోరాటం
- ప్రత్యక్షంగా, పరోక్షంగా వందల మందికి పని

ఫిదా సినిమాలో హీరోయిన్ సాయిపల్లవి బర్రె పాలు పితికితే.. ఇవేంటని ఓ కుర్రాడు అడుగుతాడు. ఉదయాన్నే పాలు తాగుతావు కదా.. అవి ఎలా వస్తాయని ప్రశ్నిస్తే సూపర్ మార్కెట్ అంటాడు. సరిగ్గా ఇప్పటి కాలం పిల్లల పరిస్థితి కూడా అలానే ఉంటోంది. పాలు, నిత్యావసరాలు ఎలా వస్తున్నాయనే విషయం కాంక్రీట్ వనాల్లో పెరుగుతున్న పిల్లల్లో కొందరికి తెలియదంటే అతిశయోక్తి కాదు. తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగులు అయితే.. ఇంట్లో పని వాళ్లు సరుకులన్నీ కొనుగోలు చేసి తీసుకురావడం, వంట వాళ్లు వండి పెడుతుండటంతో.. పిల్లలు ఇలాంటివేమీ తెలియకుండానే పెరుగుతున్నారు. కష్టం తెలియకుండా, బాధ కనపడకుండా సంవత్సరాలు గడుస్తుండటంతో మానవీయ విలువలు మరుగవుతున్నాయి.. రైతు కష్టం మట్టిలోనే కలిసిపోతుంది. ఒక్కసారి కూరగాయల మార్కెట్‌లోకి కాలు పెడితే ఓ ప్రపంచమే కళ్ల ముందు కనిపిస్తుంది. జీవితం అంటే ఏంటో అడుగడుగులో ఒక పాఠం నేర్పుతోంది.

– సాక్షి, కర్నూలు డెస్క్



ఫొటోలు: డి.హుస్సేన్

తెల్లవారుజామున 4 గంటల సమయంలో కూరగాయల మార్కెట్‌లో సందడి



ఏం అక్కా బాగున్నావా.. రెండు రోజుల నుంచి కనిపించలేదు. ఇదిగో ఈ క్యారెట్ తీసుకుపో. మంచి సరుకు వచ్చింది. ఏం వదినా ఈ మధ్య కనిపించడమే లేదు.. ఈ రోజు క్యాబేజీ బాగుంది, గిట్టుబాటవుతుంది.. ఏం బావా లేటైంది. ఇంకొంచెం ముందు వచ్చింటే బీన్స్ చాలా బాగున్నిండ. ఇంకొందరు ఇంకోలా బంధుత్వం కలుపుతూ కూరగాయలు, ఆకుకూరల విక్రయాలు చేపట్టడం కర్నూలు నడిబొడ్డున ఉన్న కూరగాయల మార్కెట్‌లో కనిపిస్తుంది. ఉదయం 8 గంటలైనా కళ్లు తెరిచేందుకు ఇష్టపడని పరిస్థితుల్లో.. ఇక్కడ మాత్రం తెల్లవారుజామున 3.30 గంటల నుంచే సరికొత్త కుటుంబం తలుపులు తెరుస్తుంది. రక్త సంబంధం లేకపోయినా, బంధుత్వం కాకపోయినా.. అందరూ వ్యాపారులు, కొనుగోలుదారులే అయినప్పటికీ పేరుతో కాకుండా ఇంటి మనుషుల్లా కలిసిపోతున్న తీరు పని ఒత్తిడిని దూరం చేస్తుంది. ఒక్క రోజు ఒకరు కనిపించకపోయినా, ఏదో కోల్పోయిన భావన అక్కడున్న వాళ్లలో కనిపిస్తుండటం మార్కెట్‌తో పెనవేసుకున్న బంధానికి అద్దం పడుతుంది.

రైతుల కష్టం వెలకట్టలేనిది

మట్టి మనుషుల కష్టం ఎంత చెప్పుకున్నా తక్కువే. అందరికీ అన్నం పెట్టే రైతులకు అడుగడుగునా గండాలే. పంట పండించడం ఒక ఎత్తయితే, అమ్ముకోవడం మరో ఎత్తు. తెల్లవారుజామున పొలానికి వెళ్లాలి. పండించిన కూరగాయలు, ఆకుకూరలను కూలీలతో తెంపించాలి. పొలం వద్దకు ఆటో వెళ్లలేని పరిస్థితి ఉంటే నెత్తిన పెట్టుకొని రోడ్డు మీదకు చేర్చాలి. ఆ తర్వాత కిలోమీటర్ల దూరం ప్రయాణించి కర్నూలు మార్కెట్‌కు మధ్యాహ్నం 2 గంటలకంతా చేర్చాలి. అక్కడ వేలం సుమారు 4 గంటల సమయంలో మొదలవుతుంది. ఆ ప్రక్రియ పూర్తయ్యే వరకు పడిగాపులు కాయాల్సిందే. ఆ తర్వాత మంచి ధర పలికితే ముఖంలో కాస్త నవ్వు కనిపిస్తుంది. లేదంటే.. ఈ బతుకింతే అనుకుని అక్కడి నుంచి వెళ్లిపోయినా, మరుసటి రోజు మళ్లీ అడుగులు పొలం వైపు పడాల్సిందే.

వ్యాపారులకు కంటి మీద కునుకు దూరం

రైతుల పరిస్థితి ఇలా ఉంటే మార్కెట్‌లో వ్యాపారులకు కంటి మీద కునుకు లేకుండా పోతుంది. మీకేం నాయనా రెండు చేతులా సంపాదిస్తారు అనేవాళ్లే కానీ.. సాయంత్రం 5 గంటల నుంచి మరుసటి రోజు 10 గంటల వరకు వీళ్లు ఒళ్లంతా కళ్లు చేసుకుంటే కానీ వ్యాపారం సాగదు. కూరగాయలు, ఆకుకూరలు పచ్చి సరుకు కావడంతో ఏరోజుకు ఆ రోజు విక్రయాలు పూర్తి చేస్తే కానీ రెండు రాళ్లు చేతిన పడని పరిస్థితి. ధర ఫర్వాలేదంటే సరే కానీ.. ఆ రోజు ధర పడిపోయిందంటే కొనుగోలు చేసిన సరుకును వందల నుంచి పదుల్లో కూడా వదిలించుకోవాల్సిందే.

వేలమంటే మాటలా!

రైతులు తీసుకొచ్చిన సరుకును మార్కెట్‌లోని సుమారు 10 దుకాణాల యజమానులు వేలంలో కొనుగోలు చేస్తారు. వీరితో పాటు బయటి ప్రాంతాల నుంచి కూడా వ్యాపారులు పాటలో పాల్గొంటారు. మార్కెట్‌కు జిల్లాతో పాటు సమీపంలోని తెలంగాణ ప్రాంత గ్రామాల నుంచి కూడా చౌళకాయలు, బెండకాయలు, టమాట, మిర్చి.. వంకాయలు.. క్యాబేజీ, క్యాలీఫ్లవర్.. బుడంకాయలు, సొరకాయలు.. దోసకాయలు, ఆకుకూరలు తీసుకొస్తుంటారు. సాయంత్రం 5 నుంచి 8 వరకు ఈ ప్రక్రియ పూర్తయితే.. ఆ తర్వాత హమాలీలు ఆయా ప్రాంతాలకు తరలించేందుకు సరుకును లోడ్ చేస్తారు. ఇదంతా పూర్తయ్యేందుకు రాత్రి సుమారు 11 గంటలు దాటుతుంది.

ఉదయాన్నే మరో ప్రపంచం

సాయంత్రం వేలంలో కొనుగోలు చేసిన సరుకుతో పాటు బెంగళూరు, హైదరాబాద్ నుంచి దిగుమతి చేసుకున్న సరుకును ఇక్కడి వ్యాపారులు ఉదయం 3.30 గంటల నుంచి విక్రయానికి ఉంచుతారు. సాయంత్రం సంచుల రూపంలో విక్రయాలు జరిగితే.. తెల్లవారుజామున కిలోల ప్రకారం అమ్మకాలు ఉంటాయి. అంటే.. ఇక్కడ కొనుగోలు చేసిన వాళ్లు తిరిగి వాటిని ఇళ్ల వద్ద దుకాణాల్లో, తోపుడు బండ్లు, గంపల్లో పెట్టుకొని విక్రయిస్తుంటారు. ఇదంతా పూర్తయ్యేందుకు 10 నుంచి 11 గంటల సమయం గడిచిపోతుంది. ఇలా రోజంతా మార్కెట్‌లో హడావుడి కనిపిస్తుంది. కొందరు అప్పటికప్పుడు డబ్బులు చెల్లించి కొనుగోలు చేస్తే.. మరి కొందరు అప్పటికి సరుకు తీసుకెళ్లి విక్రయాలు పూర్తయ్యాక సాయంత్రానికి చెల్లింపులు చేస్తుంటారు. ఇదంతా నమ్మకం మీద సాగుతున్న వ్యవహారం.

మార్కెట్ అంటేనే ఉపాధి

వ్యాపారులు, రైతుల మాట అలాఉంటే.. ఒక్కో దుకాణం మీద ఆధారపడి పదుల సంఖ్యలో ఉపాధి పొందుతున్నారు. వీరిలో కొందరికి జీతాలు, రోజువారీ కూలీ ఇస్తుండగా.. మరికొందరు చేతనైన పని చేస్తూ ఇచ్చింది తీసుకెళ్తుంటారు. రాత్రిళ్లు సరుకు ఇతర ప్రాంతాల నుంచి వస్తుండటంతో దుకాణాల్లో పనికి కుదిరిన యువకులు సాయంత్రం 6 గంటలకే అక్కడికి చేరుకొని దినచర్యలో తలమునకలవుతారు. అక్కడి నుంచి యజమానులు తెల్లవారుజామున 3.30 గంటలకు దుకాణానికి చేరుకునే సమయానికి సరుకును లెక్క చూసుకొని, దింపుకొని విక్రయానికి సిద్ధం చేస్తారు. ఇవన్నీ అమ్ముడుపోయి, ఇంటికి చేరుకునేందుకు గడియారం 10 గంటలు కొట్టాల్సిందే.

కరోనా సమయంలో ఉక్కిరిబిక్కిరి

ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిన కరోనా మహమ్మారి మార్కెట్‌ను కూడా కుదిపేసింది. అయితే నిత్యావసరంలో భాగం కావడంతో కూరగాయలు, ఆకుకూరల విక్రయం ఎంతో మందికి కొత్తగా ఉపాధి కూడా చూపింది. కరోనా ఉధృతి నేపథ్యంలో ఇక్కడున్న మార్కెట్‌ను మొదట పెద్దపాడుకు, ఆ తర్వాత కర్నూలు శివారుకు.. అనంతరం జగన్నాథగట్టుకు మార్చడంతో వ్యాపారులతో పాటు రైతులు చుక్కలు చూడాల్సి వచ్చింది. అయినప్పటికీ వీళ్లు కరోనాకు ఎదురొడ్డి నిలవడంతో అందరి ఆకలి తీరింది.. వీళ్ల జీవితం నిలదొక్కుకుంది.



ఇతని పేరు శాంసన్. వయస్సు 20 ఏళ్లు. తండ్రి అకాల మరణంతో కుటుంబానికి పెద్ద దిక్కుగా మారాడు. ఇద్దరు అక్కలకు వివాహమైంది. అయితే పుట్టుకతోనే ఈ యువకుడు దివ్యాంగుడు. ఒక చేయి పూర్తిగా సహకరించని పరిస్థితిలో ఐదేళ్ల నుంచి మార్కెట్‌నే నమ్ముకొని జీవిస్తున్నాడు. ఒంటి చేత్తోనే ఇది చేతకాదు అనుకోకుండా అన్ని పనులు చక్కబెడుతున్నాడు.



ఈమె పేరు వరలక్ష్మి. వయస్సు 40 పైనే. భర్త హమాలీ పనులు చేస్తుండగా, ఇద్దరు ఆడ పిల్లలు సంతానం. ఒక కుమార్తెకు వివాహమైంది. ఒక్కరి సంపాదనతో కుటుంబం గడవటం కష్టం కావడంతో కూరగాయల విక్రయాన్ని ఉపాధిగా మార్చుకుంది. కోడి కూయక ముందే మార్కెట్‌కు చేరుకుంటుంది. ఎక్కువగా విక్రయమయ్యే కూరగాయలను కొనుగోలు చేసి నంద్యాల చెక్‌పోస్టు ప్రాంతంలో విక్రయిస్తూ భర్తకు అండగా నిలుస్తోంది.



ఈమె పేరు శంకరమ్మ. వయస్సు 50 ఏళ్లు. నగరంలోని షరీన్‌నగర్‌లో నివాసం. ఏడేళ్ల క్రితం వరకు భర్త మాదన్న చిన్న చిన్న పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. అయితే పక్షవాతం రావడంతో మంచానికే పరిమితం అయ్యాడు. అప్పటి నుంచి కూలీ పనులు చేస్తూ శంకరమ్మ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. కరోనాతో ఈ కుటుంబం పస్తులుండాల్సిన పరిస్థితి. ఆ సమయంలోనే కూరగాయల విక్రయాన్ని ఉపాధిగా చేసుకొంది. తెల్లవారుజామున మార్కెట్‌కు వచ్చి అవసరమైన కూరగాయలు కొనుగోలు చేసి ఇంటి సమీపంలోనే విక్రయాలు చేస్తూ జీవనం సాగిస్తోంది.



కూరగాయలను అమ్మేందుకు వెళ్తున్న వృద్ధుడు



తూకం వేసి బరువును సంచిపై రాస్తూ..

మార్కెట్ స్వరూపం

విస్తీర్ణం: సుమారు 10 ఎకరాలు		పరోక్షంగా ఆధారపడిన కుటుంబాలు 700-800	
కూరగాయల విక్రయ దుకాణాలు	ఒక్కో దుకాణంలో గుమాస్తాలు	ఆకుకూరల విక్రయ దుకాణాలు	ఒక్కో దుకాణంలో గుమాస్తాలు
100	8-10 మంది	60	3-5 మంది



కూరగాయలను లోడింగ్ చేస్తున్న దృశ్యం

ఆదికవి వాల్మీకిని ఆదర్శంగా తీసుకోవాలి

- కర్నూలు ఎంపీ సంజీవ్‌కుమార్
- జెడ్పీలో ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ సంజీవ్‌కుమార్, మేయర్ రామయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్‌చంద్రబోస్, చిత్రంలో జిల్లా అధికారులు, వాల్మీకి నేతలు

కర్నూలు(అర్బన్): రామాయణాన్ని మధుర కావ్యంగా మలచిన మహనీయులు ఆదికవి వాల్మీకి మహర్షిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని కర్నూలు పార్లమెంట్ సభ్యులు డాక్టర్ ఎస్ సంజీవ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ఎంపీ సంజీవ్‌కుమార్, నగర మేయర్ బీవై రామయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మ, కార్పొరేటర్ గాజుల శ్వేతారెడ్డి, వెంకాయపల్లె ఎల్లమ్మ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ బేతం కృష్ణుడు, ఆరెకటికె కార్పొరేషన్ డైరెక్టర్ గౌతం, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ రమేష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం మహర్షి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి పూజ చేశారు. జిల్లా బీసీ సంక్షేమం, సాధికారత అధికారిణి పీ వెంకటలక్షుమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ.. హిందూ సమాజానికి ఆదికవి మొదటి కావ్యాన్ని అందించి, ఒక మంచి జీవన విధానాన్ని తెలియజేశారన్నారు. బోయ అంటే భయం లేని వారని, వారు నమ్మితే ఎందాకైనా వస్తారని, వారిలో క్షత్రియ గుణాలు ఉంటాయన్నారు. విద్య, వైద్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నారన్నారు. బోయ కులానికి చెందిన ప్రతి ఒక్కరూ విద్యా వంతులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ బీసీ సంక్షేమ శాఖ అధికారి భరత్‌కుమార్, వీఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గూడూరు గిడ్డయ్య, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మద్దయ్య, బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, మైనారిటీ విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షులు షేక్ యూనస్‌బాషా, కప్పట్రాళ్ల రామచంద్రనాయుడు, బత్తుల లక్ష్మీకాంతయ్య, జ్ఞానేశ్వరమ్మ, పద్మజానాయుడు, చంద్రికమ్మ తదితరులు పాల్గొన్నారు.



కర్నూలులోని కృష్ణదేవరాయ సర్కిల్‌లో పూజలు అందుకున్న మహర్షి వాల్మీకి విగ్రహం

జాతికి సన్మార్గాన్ని నిర్దేశించిన మహర్షి



మహర్షి వాల్మీకి రామాయణాన్ని మహా అద్భుత కావ్యంగా మలిచి జాతికి సన్మార్గాన్ని నిర్దేశించారు. మన భారతదేశం పుణ్య భూమి, కర్మభూమి. పూజ్య గ్రంథమైన రామాయణాన్ని రచించిన పూజ్యనీయులు మహర్షి వాల్మీకి. రామాయణంలో దాదాపు 24 వేల శ్లోకాలు ఉన్నాయి. చుట్టూ పుట్ట పెరిగినా.. దీక్ష, తపస్సును విడవకుండా పూర్తి చేసిన మహానుభావుడు వాల్మీకి మహర్షి. రామాయణ మహా కావ్యంలో ఆయన చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలి.

– డాక్టర్ సృజన, జిల్లా కలెక్టర్

విద్యతో వెనుకబాటును అధిగమించాలి

ఆదికవి మహర్షి వాల్మీకి వారసులంతా విద్యతో వెనుకబాటుతనాన్ని అధిగమించాలి. వాల్మీకుల వెనుకబాటుతనాన్ని రూపుమాపేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. ఎన్నడూ లేని విధంగా కీలకమైన రాజ్యాంగ పదవులను వాల్మీకులకు కేటాయించారు. వాల్మీకుల దశాబ్దాల కలను సాకారం చేసేందుకు ఎస్టీ రిజర్వేషన్ అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించారు. నగరంలో వాల్మీకి విగ్రహం ఉన్న ప్రాంతంలో కూడలిని ఏర్పాటు చేసి కాంస్య విగ్రహాన్ని పెడతాం. వాల్మీకి కమ్యూనిటీ హాల్ నిర్మాణం అంశాన్ని ఇటీవల ఎమ్మిగనూరుకు వచ్చిన సందర్భంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువచ్చాం. త్వరలోనే కమ్యూనిటీ హాల్‌కు భూమి పూజ చేస్తాం.

– బీవై రామయ్య, నగర మేయర్

ఇచ్చిన మాటకు కట్టుబడిన సీఎం వైఎస్ జగన్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వాల్మీకులకు ఇచ్చిన మాట మేరకు ఎస్టీ రిజర్వేషన్ అంశంపై అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపారు. ఈ అంశానికి సంబంధించి వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సభ్యులు పలుమార్లు పార్లమెంట్‌లో ప్రస్తావించారు. అయినా కేంద్ర ప్రభుత్వంలో చలనం కరువైంది. వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ అంశంపై ఇప్పటికే పలుమార్లు ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నాలు నిర్వహించాం.

– ఎం సుభాష్ చంద్రబోస్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

క్లుప్తంగా

డీఈఎల్ఈడీ సెమిస్టర్ ఫలితాల విడుదల

కర్నూలు సిటీ: ఈ ఏడాది ఆగస్టు 10 నుంచి 17వ తేదీ వరకు నిర్వహించిన డీఈఎల్ఈడీ(డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) థర్డ్ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల అయినట్లు డీఈఓ డా.వి రంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 1,607 మంది విద్యార్థులు హాజరుకాగా 1,521 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు. ఫలితాలు www. bse. ap. gov. in అనే వెబ్‌సైట్లో చూసుకోవచ్చునని సూచించారు.

టెక్నికల్ పరీక్ష ఫలితాలు..

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు ఈ ఏడాది జూలై 3 నుంచి 7వ తేదీ వరకు జరిగాయని, పరీక్షల ఫలితాలు విడుదల చేసినట్లు డీఈఓ డా.వి రంగారెడ్డి తెలిపారు. టైలరింగ్, డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్ లోయర్, హైయ్యర్, వీవింగ్ థియరీ పరీక్షలకు 2,691 మంది అభ్యర్థులు హాజరుకాగా 1,733 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు.

నేడు ఎస్సార్బీసీకి నీరు విడుదల

పాణ్యం: ఎస్సార్బీసీ ఆయకట్టు రైతులకు ఆదివారం నీరు విడుదల చేయనున్నట్లు ఈఈ సుభకుమార్ శనివారం విలేకరులకు తెలిపారు. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 800 క్యూసెక్కుల మేర నీటిని పంపుతున్నట్లు, రైతులు అవసరమైన మేర ఉపయోగించుకోవాలని సూచించారు.

కోలుకోలేక సచివాలయ ఉద్యోగి మృతి


మృతుడు చిన్నరాజు (ఫైల్)

వెల్దుర్తి(కృష్ణగిరి): రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక గోవర్ధనగిరి సచివాలయం-1 ఇంజినీరింగ్ అసిస్టెంట్ కటికల చిన్నరాజు(32) శనివారం మృతిచెందాడు. కల్లూరు మండలం ఉలిందకొండకు చెందిన సూర్యకాంతమ్మ, సోమన్నల పెద్ద కుమారుడు చిన్నరాజు 2019 అక్టోబరులో ఉద్యోగాన్ని సాధించారు. గతేడాది తండ్రి చనిపోగా.. తల్లి, చెల్లి, తమ్ముడితో ఉంటూ కుటుంబ భారం మోస్తూ వచ్చాడు. శుక్రవారం విధి నిర్వహణ అనంతరం స్వగ్రామానికి బైక్‌పై తిరిగి వెళ్తుండగా లారీనీ ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకోలేక మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులకు పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి తన సంతాపాన్ని తెలిపారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు.

మాజీ సైనికుల పిల్లలకు ఉపకార వేతనాలు

కర్నూలు(అర్బన్)/నంద్యాల(న్యూటౌన్): ప్రొఫెషనల్ డిగ్రీ కోర్సులు (ఉన్నత విద్యా కోర్సులు) మొదటి సంవత్సరం చదువుతున్న మాజీ సైనికుల పిల్లలకు 2023-24 విద్యా సంవత్సరానికి ప్రధానమంత్రి ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు జిల్లా సైనిక సంక్షేమాధికారిణి ఎస్ఆర్ రత్నరూత్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రీయ సైనిక్ బోర్డు, రక్షణ శాఖ న్యూఢిల్లీ వారి ఆధ్వర్యంలో ఈ ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన విద్యార్థులు www.ksb.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో నవంబర్ 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

తరగతి గదిలోనే దేశ భవిష్యత్ నిర్మాణం

- సీబీఐ మాజీ జేడీ చైర్మన్ లక్ష్మీనారాయణ
- కనులపండువగా శ్రీశైలం ప్రాజెక్ట్ ఉన్నత పాఠశాల వజ్రోత్సవం
- గురువులు, డ్యామ్ ఇంజినీర్లు, ఉద్యోగులకు సన్మానం
- వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డులో స్పోసా గీతం నమోదు



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చైర్మన్ శిల్పా చక్రపాణిరెడ్డి


స్పోసా గీతాన్ని ఆలపిస్తున్న పూర్వ విద్యార్థులు

శ్రీశైలం ప్రాజెక్ట్: దేశ భవిష్యత్ పాఠశాల తరగతి గదుల్లోనే నిర్మాణమవుతుందని శ్రీశైలం ప్రాజెక్ట్ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ (స్పోసా) చైర్మన్, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. శనివారం శ్రీశైలం ప్రాజెక్ట్ ఉన్నత పాఠశాలలో వజ్రోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించారు. పాఠశాల ప్రారంభమై 60 వసంతాలు గడిచిన సందర్భంగా పాఠశాలలో పూర్వ విద్యార్థులు సుమారు 6 వేల మంది హాజరై వేడుకలను విజయవంతం చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మనిషికి జ్ఞానం అవసరం అని, ఆ జ్ఞానాన్ని తల్లిదండ్రులు, సామాజిక పరిస్థితులు, గురువులు అందిస్తారన్నారు. పాఠశాలలో పుస్తక జ్ఞానమే కాకుండా గురువుల అనుభవ జ్ఞానాన్ని బోధించినప్పుడే విద్యార్థికి దిశానిర్దేశం సాధ్యమన్నారు. పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పడిన తర్వాత పాఠశాలకు 50 వసంతాల సమయంలో ప్రత్యేక తరగతి గదుల నిర్మాణం, పాత తరగతి గదుల మరమ్మతులు ఇతరత్రా పనులు చేపట్టడం సంతోషదాయకమన్నారు. భావితరాల ఉజ్వల భవిష్యత్‌కు కృషి చేయాలని వేడుకలకు హాజరైన వారికి పిలుపునిచ్చారు.

➡ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అసెంబ్లీ ఎథిక్స్ కమిటీ చైర్మన్, శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ శ్రీశైలం మండలంలోని సున్నిపెంట గ్రామం ప్రత్యేకమైనదన్నారు. ఈ ప్రాంతంలో నివసిస్తున్న ఎవరికీ భూమిపై యాజమాన్యపు హక్కులు లేని విషయం తెలుసుకుని పంచాయతీగా చేసేందుకు కృషి చేశానన్నారు. రోడ్లు, పారిశుధ్యం, మంచినీటి సరఫరా, విద్యుత్ దీపాలు తదితర మౌలిక వసతులు కల్పించామన్నారు. త్వరలోనే ఈ ప్రాంతంలో నివసిస్తున్న ప్రతి ఒక్కరికీ భూమి, ఇళ్లపై యాజమాన్యపు హక్కులను అతి తక్కువ ధరకే కల్పిస్తున్నట్లు ఆయన హామీ ఇచ్చారు.

➡ నంద్యాల జిల్లా విద్యాధికారి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యం కోసం అనేక సంస్కరణలు చేపట్టిందన్నారు. తాము చదువుకునే సమయంలో సరైన తరగతి గదులు లేకపోవడం, పుస్తకాలు కొనలేని పరిస్థితి ఉండేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి పథకం, జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద వంటి పథకాలను ప్రవేశపెట్టి పేద విద్యార్థులకు ఎంతో మేలు చేశారన్నారు.

ఆవిష్కరణలు.. సన్మానాలు

రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న పాఠశాల వజ్రోత్సవ వేడుకల్లో మొదటి రోజు శనివారం ఆవిష్కరణలు, సన్మానాలతో సాగింది. వేలాది తరలివచ్చిన పూర్వ విద్యార్థులతో పాఠశాల ఆవరణ కిక్కిరిసి కనిపించింది. కార్యక్రమంలో భాగంగా ముందుగా ఉత్సవాల లోగోను శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి, స్పోసా చైర్మన్ వీవీఎస్ లక్ష్మీనారాయణ ఆవిష్కరించారు. అనంతరం వజ్ర సంకల్పం అనే పుస్తకాన్ని పాఠశాల పూర్వ విద్యార్థి ఈ ప్రాంతంలో తన అనుభవాలపై రాసిన 'నెమలి కన్నులు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. పాఠశాలకు చెందిన


వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్సుతో ఎమ్మెల్యే శిల్పా, స్పోసా చైర్మన్ లక్ష్మీనారాయణ

పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో మృతి చెందిన వారికి నివాళులు అర్పించారు. అలాగే పాఠశాల గురువులను, శ్రీశైలం డ్యామ్ నిర్మాణంలో పాల్గొన్న ఇంజినీర్లు, సిబ్బంది, ప్రభుత్వ వైద్యశాల ఉద్యోగులను పూర్వ విద్యార్థులు సన్మానించారు. శాలువాతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. శ్రీశైలం డ్యామ్, శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రాల నిర్మాణంలో భాగస్వామి అయిన కాంట్రాక్టర్ వేమారెడ్డిని స్పోసా కమిటీ ఈ సందర్భంగా సన్మానించింది.

వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డుల్లో స్పోసా గీతం

వజ్రోత్సవాలను పురస్కరించుకొని 6 వేల మంది పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, స్థానికులు, ఉద్యోగులు ఒక్కసారిగా ఆలపించిన ప్రత్యేక స్పోసా గీతం వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు చేసుకుంది.

"సదా జయము నీకే స్పోసా సుధాస్ఫూర్తి
నీవే పృథ్వీతలమున పూర్వ విద్యార్థి
దిగ్విజయాలకు శ్వాసవు నీవే
చిరుప్రాయమ్మున దొరికిన చెలిమి, పెరిగెడి
వయసుతో తరుగని కలిమి
శ్రీశైలమ్మున చదువుట తలచి, ఋణమును
తీర్చగ తరలెను స్పోసా
బడియొక గుడియను భావన తలచి,
బోధించిన గురుపాదము కొలిచి,
సాధించిన మా సమిష్టి ఫలములు తదుపరి
తరముకు పంచుటె భాగ్యము
పర్వత శ్రేణి పునాదిపై నిలిచి, పచ్చని
వనముల నీడను విరిసిన
విద్యాలయమున విజయ పతాకము,
విశ్వమంతకును వెలుగుల నీడగా"


ఇంజినీర్లను సన్మానిస్తున్న స్పోసా కమిటీ సభ్యులు


కార్యక్రమానికి తరలివచ్చిన పూర్వ విద్యార్థులు, డ్యాం రిటైర్డ్ అధికారులు తదితరులు

బడిఈడు పిల్లలు పాఠశాలలో ఉండాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రంగారెడ్డి

ఆదోని సెంట్రల్: బడిఈడు పిల్లలు పాఠశాలలో ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారి రంగారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో ప్రభుత్వ బాలికల పాఠశాల, పురపాలక ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనం, బోధనా సామర్థ్యాలను ఆయన పరిశీలించారు. జిల్లాలో 700 మంది విద్యార్థులు డ్రాపౌట్స్ అయినట్లు తెలిపారు. ఆదోని నియోజకవర్గంలో 99 మంది విద్యార్థులు డ్రాపౌట్స్ కాగా 48 మందిని తిరిగి పాఠశాలల్లో చేర్పించామన్నారు. మిగిలిన వారిని కూడా పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రధానోపాధ్యాయుల నుంచి ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. డీఈఓ వెంట మండల విద్యాధికారి-2 శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయులు మల్లికార్జున, అలిసిద్దిఖీ ఉన్నారు.

'సాక్షి' ఫొటోగ్రాఫర్‌కు జాతీయ అవార్డు


అవార్డుకు ఎంపికైన ఫొటో


వడ్డే శ్రీనివాసులు

కర్నూలు(సెంట్రల్): 'సాక్షి' కర్నూలు యూనిట్‌లో ఫొటోగ్రాఫర్‌గా పనిచేసే వడ్డే శ్రీనివాసులుకు జాతీయ అవార్డు లభించింది. నవంబర్ 1వ తేదీ ప్రపంచ ఫొటో జర్నలిజమ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇండియా ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫిక్ కౌన్సిల్, ఫొటోగ్రాఫీ అకాడెమీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జాతీయ స్థాయి అవార్డులు ప్రకటించారు. ఈ అవార్డుకు వడ్డే శ్రీనివాసులు తీసిన 'చల్లని ఐడియా' (ఎండ వేడిమికి తట్టుకోలేక ఒక పెద్దాయన ఫౌంటేన్ కింద సేద తీరుతున్న) ఫొటో ఎంపికైంది. నవంబర్ 1వ తేదీన విజయవాడలోని బాలోత్సవ్ భవన్‌లో వడ్డే శ్రీనివాసులుకు రూ.2 వేల నగదుతోపాటు ప్రశంసా పత్రాన్ని అందజేయనున్నారు.

వచ్చే నెల 10 లోపు 'పది' పరీక్ష ఫీజు చెల్లించాలి

కర్నూలు సిటీ: వచ్చే ఏడాది జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు నవంబర్ 10వ తేదీలోపు ఫీజు చెల్లించాలని డీఈఓ డా.వి రంగారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50 ఆలస్య రుసుంతో నవంబరు 16వ తేది వరకు, రూ.200 అపరాధ రుసుంతో 22వ తేదీ, రూ.500 అపరాధ రుసుంతో 30వ తేదీలోపు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. అన్ని సబ్జెక్టులకు రెగ్యులర్ విద్యార్థులు రూ.125, ఫెయిల్ అయిన విద్యార్థులు 3 సబ్జెక్టుల కంటే ఎక్కువ ఉంటే రూ.125, మూడు సబ్జెక్టుల వరకు అయితే రూ.110, వొకేషన్ విద్యార్థులు రూ.60 అదనంగా, తక్కువ వయస్సు గల పిల్లలు రూ.300, మైగ్రేషన్ సర్టిఫికెట్ కోసం రూ.80 చెల్లించాలన్నారు. షెడ్యూల్ కులాలు/షెడ్యుల్ తెగలు, వెనుకబడిన తరగతులకు చెందిన విద్యార్థులు మొదటిసారి పరీక్షలకు హాజరు అవుతున్నట్లయితే వారికి ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుందన్నారు. అయితే వారి తల్లిదండ్రుల ఆదాయం పట్టణ ప్రాంతాల్లో ఏడాదికి రూ.24 వేలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.20 వేలు మించకూడదని, 2.5 ఎకరాల చిత్తడి నేల/5 ఎకరాల పొడి భూమి మించకుండా ఉండాలన్నారు. ప్రధానోపాధ్యాయులు నిబంధనల ప్రకారం మండల రెవెన్యూ అధికారి జారీ చేసిన ధ్రువీకరణ పత్రం తల్లిదండ్రుల ద్వారా తెప్పించుకోవాలన్నారు. పరీక్ష ఫీజుతో పాటు, వొకేషనల్ విద్యార్థులు, మైగ్రేషన్ సర్టిఫికెట్ల కోసం రుసుం ఆన్‌లైన్‌లో నామినల్ రోల్‌తో పాటు www. bse. ap. gov. in అనే వెబ్‌సైట్‌లో చెల్లించాలన్నారు.

పారా రోయింగ్ పోటీల్లో ప్యాపిలి యువకుడి ప్రతిభ


రోయింగ్‌లో సత్తా చాటిన వెంకటనారాయణ

- ప్రధాని మోదీ ప్రశంస



ప్రధాని మోదీ ట్వీట్

ప్యాపిలి: పారా రోయింగ్ పోటీల్లో ప్యాపిలికి చెందిన కొంగనపల్లి వెంకటనారాయణ ప్రతిభ చాటాడు. ఈ నెల 26 నుంచి శనివారం (28 వ తేదీ) వరకు చైనాలోని హంగ్‌జౌలో రోయింగ్ పీఆర్3 మిక్స్‌డ్ డబుల్ పోటీలు జరిగాయి. భారత్ తరఫున ప్యాపిలికి చెందిన వెంకటనారాయణ, రాజస్థాన్‌కు చెందిన అనిత ఈ పోటీల్లో పాల్గొన్నారు. 2 కిలోమీటర్ల దూరాన్ని 8 నిమిషాల 50 సెకన్లలో రోయింగ్ చేసిన ఈ జంట ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. ఈ పోటీల్లో భారత్‌తో పాటు చైనా, థాయ్‌లాండ్, ఉజకిస్థాన్, జపాన్ దేశాలకు చెందిన క్రీడాకారులు తలపడ్డారు. భారత్ ద్వితీయ స్థానంలో నిలవడం పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేస్తూ వెంకటనారాయణ, అనితలను అభినందిస్తూ ట్వీట్ చేశారు. ప్యాపిలి క్రీడాకారుడు అంతర్జాతీయ స్థాయిలో భారత్ తరఫున పాల్గొని ప్రతిభ చాటడం పట్ల పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముగిసిన దేవరగట్టు ఉత్సవాలు

- నెరణికి గ్రామానికి చేరిన మాళమల్లేశ్వర ఉత్సవ విగ్రహాలు

హొళగుంద: మాళ మల్లేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలు నెరణికి గ్రామానికి చేరడంతో దేవరగట్టు దసరా బన్ని మహోత్సవాలు శనివారం ముగిశాయి. అంతకు ముందు కంకణ విసర్జన అనంతరం దేవరగట్టులోని కాడసిద్ధప్ప మఠంలో ఉంచిన ఉత్సవ మూర్తులకు ఆలయ పూజారులు అభిషేకం చేశారు. అనంతరం విగ్రహాలను, పల్లకీని నెరణికి, నెరణికి తండా, కొత్తపేట గ్రామస్తుల మధ్య గొరవయ్యలు భక్తిశ్రద్ధలతో నెరణికి గ్రామానికి చేర్చారు.


గ్రామంలో పండుగ

విగ్రహాలు చేరడంతో నెరణికి గ్రామంలో పండుగ వాతవరణం నెలకొంది. బన్ని ఉత్సవాలనంతరం ఈ గ్రామంలో దసరా వేడుకలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దేవరగట్టు నుంచి గ్రామానికి చేరిన విగ్రహాలను ఆంజనేయస్వామి ఆలయం ముందు కొలువుంచి మహామంగళారతి ఇచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆలయం నుంచి విగ్రహాలను అర్చకుల ఇంటి వరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఊరేగింపులో చిన్నారులు 'బన్ని' (కర్రలు పట్టుకుని ఎగురుతూ) ఆడుతూ కనిపించారు. ప్రజలు శనివారం ముగింపు వేడుకలను ఘనంగా జరుపుకుని మల్లయ్య దీక్షను విరమించారు. ఆలూరు సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో హొళగుంద ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది బందోబస్తు చేపట్టారు.


దేవరగట్టు నుంచి నెరణికి గ్రామానికి ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్తున్న దృశ్యం


పల్లకీని మోసుకొస్తున్న కానిస్టేబుళ్లు

అందరి సహకారంతో ఉత్సవాలు ప్రశాంతం



దేవరగట్టు దసరా బన్ని ఉత్సవాలు అందరి సహకారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది రెండు లక్షల మంది వరకు భక్తులు బన్ని ఉత్సవాన్ని తిలకించారు. వచ్చిన భక్తులకు తాగునీరు ఇతర అన్ని సౌకర్యాలు కల్పించాం. నెరణికి, నెరణికి తండా, కొత్తపేటతో పాటు చుట్టు పక్కల గ్రామస్తులు సంప్రదాయంగా పండుగను జరుపుకున్నారు. ఉత్సవాలు విజయవంతం కావడానికి జిల్లా అధికార, పోలీసు యంత్రాంగం సహకరించారు.

–గుమ్మనూరు శ్రీనివాసులు, దేవరగట్టు ఆలయ చైర్మన్